సాక్షి సంగారెడ్డి

బుధవారం । 13 । ఆగస్టు । 2025



ఆటాడుకుందాం రా

విద్యార్థులలో మానసిక ఉల్లాసానికి తోడ్పడే క్రీడా పోటీలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. వివరాలు 8లో ▸



చెక్‌డ్యాం నిధుల జాడేది

నారింజ ప్రాజెక్టు నీళ్లు పక్కరాష్ట్రం పాలవకుండా ప్రతిపాదించిన చెక్‌డ్యాంలకు నిధులు మంజూరు కాలేదు. వివరాలు 8లో ▸



రోడ్లపై మురుగు వరద

ఇటీవల కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీలు పొంగి అమీన్‌పూర్‌పట్టణంలో రోడ్లపైకి మురుగునీరు ప్రవహిస్తోంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

పలువురు వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు

సదాశివపేట (సంగారెడ్డి)/ సంగారెడ్డి జోన్: విధులకు గైర్హాజరైన పలువురు వైద్యాధికారులకు కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం సదాశివపేట ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసిన సమయంలో ఎటువంటి సమాచారం లేకుండా పలువురు వైద్యాధికారులు విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. గైర్హాజరైన వారిలో డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ విజయ్ శంకర్, డి.ఎ.ఎస్ డాక్టర్ సత్యనారాయణ, సి.ఎ.ఎస్ డాక్టర్ దివాకర్, డాక్టర్ యాదగిరి, డాక్టర్ జి.మల్లికార్జున్, డాక్టర్ కె.ఉమామహేశ్వరి, డాక్టర్ రత్నసాయిలు ఉన్నారు.

ఎమ్మెల్సీ దంపతుల గృహనిర్బంధం



గృహనిర్బంధంలో అంజిరెడ్డి దంపతులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో పెద్దమ్మతల్లి ఆలయం తరలింపుపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం కావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇందులో భాగంగా మంగళవారం రామచంద్రాపురం పట్టణంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరిని పోలీసులు గృహనిర్బంధం చేశారు.

క్షయ బాధితులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

జహీరాబాద్ టౌన్: క్షయ (టీబీ) వ్యాధి మందులు వాడుతున్న బాధితులకు మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గాయత్రీదేవి న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 10 మందికి కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గాయత్రీదేవి మాట్లాడుతూ టీబీని సకాలంలో గుర్తించి మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు రవికుమార్, మొగులయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖేడ్ అభివృద్ధికి కృషి చేయండి



సబ్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేయాలని సబ్ కలెక్టర్ ఉమాహారతిని నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆమెను ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు. సబ్ కలెక్టర్‌ను కలసిన వారిలో ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

యాంత్రీకరణతో అధిక దిగుబడులు

జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

పుల్‌కల్(అందోల్): సాగులో యాంత్రీకరణపద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని రిటైర్డు ఐఏఎస్ అధికారి నాగిరెడ్డి పొలంలో వరిలో కలుపుతీసే యంత్రాన్ని మంగళవారం రైతులకు చూపించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ...వరిలో కలుపు తీసే యంత్రాలు వాడటం వల్ల దుబ్బ పెరిగి వరి కంకులు ఎక్కువ వస్తాయన్నారు.

స్పష్టమైన లక్ష్యంతో ముందడుగు వేయాలి

మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత

జహీరాబాద్ టౌన్: స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని యువత ముందడుగు వేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలిత కుమారి సూచించారు. పట్టణంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మంచి నడవడికతో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ దేశాభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత తమ వంతు పాత్ర పోషించాలని చెప్పారు.





భక్తులతో కిటకిటలాడిన గణేష్‌గడ్డ

అంగారక చతుర్థి సందర్భంగా భారీగా వచ్చిన భక్తులు

అంగారక చతుర్థిని పురస్కరించుకుని పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలో గణేష్‌గడ్డ దేవస్థానం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. భారీ సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా కనిపించాయి. ఉదయం నుంచి గణనాథుడికి తేనెతో ప్రత్యేక అభిషేకం చేసినట్లు ఆలయ అర్చకులు, నిర్వాహకులు తెలిపారు. – పటాన్‌చెరు టౌన్:

ప్రమాదాలపై అప్రమత్తం

45కు పైగా పారిశ్రామిక క్లస్టర్లలో క్విక్ రెస్పాన్స్ సెంటర్లు

- ఫైరింజన్లు, అంబులెన్స్, జేసీబీలు అందుబాటులో ఉండేలా చర్యలు
- ప్రమాద సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య. చిత్రంలో ఎస్పీ పరితోశ్ పంకజ్ తదితరులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఏదైనా పరిశ్రమలో ప్రమాదం జరిగితే ఎక్కడో ఫైర్‌స్టేషన్‌లో ఉన్న ఫైరింజన్ ట్రాఫిక్ పద్మవ్యూహం నుంచి తప్పించుకుని వచ్చేసరికి విలువైన ప్రాణాలు, ఆస్తి బూడిదైపోతున్నాయి. అదే పరిశ్రమ ఉన్న ప్రాంతంలోనే ఫైరింజన్ ఉంటే..చాలావరకు ప్రాణ, ఆస్తినష్టాన్ని తగ్గించవచ్చు.

అదేవిధంగా క్షతగాత్రులను వైద్యం కోసం తీసుకెళ్లేందుకు పరిశ్రమల సమీపంలోనే ఓ అంబులెన్స్ ఉంటే వెంటనే వారిని తరలించి తక్షణ చికిత్స అందజేయడం ద్వారా ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చు.

ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యల కోసం ప్రైవేటు జేసీబీల యజమానులతో మాట్లాడి వాటిని ఘటనాస్థలికి తీసుకొచ్చేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. అదే జేసీబీ వంటి యంత్రాలు పరిశ్రమల సమీపంలోనే ఉంటే ఎంతోకొంత నష్టాన్ని నివారించవచ్చు.

ఇలా పరిశ్రమల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త భద్రతాచర్యలు ఒక ఎత్తు అయితే ప్రమాదాలు జరిగితే ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంత వరకు తగ్గించి, తక్షణ సహాయక చర్యలు చేపట్టడం అనేది మరో సవాల్‌గా మారుతోంది. ఈ సవాల్‌ను అధిగమించేందుకు జిల్లాలో పరిశ్రమలున్న ప్రాంతాల్లో క్విక్ రెస్పాన్స్ సెంటర్ (తక్షణం స్పందించే కేంద్రాలు)లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేంద్రాల్లో ఫైరింజన్‌తోపాటు, అంబులెన్స్, వైద్య సిబ్బంది, జేసీబీ, రవాణా వాహనాలు అందుబాటులో ఉంచడం ద్వారా ఆ ప్రాంతంలో ఏదైనా పరిశ్రమలో ప్రమాదం జరిగితే వెంటనే సహాయక చర్యలు చేపట్టేందుకు వీలు కలుగుతుంది. ఇటీవల జరిగిన సిగాచి పరిశ్రమ ప్రమాదంతోపాటు, గతేడాది జరిగిన ఎస్‌బీ ఆర్గానిక్ ఘటనల అనుభవాలను పరిశీలిస్తే ఈ కేంద్రాల ఏర్పాటు అనివార్యమనే అభిప్రాయానికి అధికారులు వచ్చారు.

పరిశ్రమల భద్రతపై రాజీపడొద్దు: కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: పరిశ్రమలలో అన్ని రకాల భద్రతాచర్యలు చేపట్టాలని ఈ విషయంలో ఎక్కడా రాజీపడొద్దని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పరిశ్రమల భద్రతపై ఎస్పీ పరితోశ్ పంకజ్‌తోపాటు వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇటీవల జరిగిన సిగాచిలో ప్రమాదం అనంతరం పరిశ్రమల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి వహించిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీవ్రతను తగ్గించడంతోపాటు అవసరమైన సహాయక చర్యలు చేపట్టేలా చూడాలన్నారు. కార్మికుల పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ప్రమాదం జరిగే పరిశ్రమలు ముందుగానే గుర్తించి తనిఖీలు ప్రారంభించి రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ గౌరీశంకర్, డైరెక్టర్ మోహన్‌బాబు, జిల్లా పరిశ్రమల అధికారి తుల్జానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐలాలు లేని చోట్ల వీటి స్థాపన..

జిల్లాలో అనుమతులు పొందిన పరిశ్రమలు మొత్తం 2,171 ఉండగా..ఇందులో ప్రమాదాలు ఎక్కువగా జరిగే హైరిస్క్ పరిశ్రమలు 601 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న ఈ పరిశ్రమలు ఉన్న ప్రాంతాలు (క్లస్టర్లు) సుమారు 45కు పైగా ఉంటాయని అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఈ 45 చోట్లకు పైగా క్విక్ రెస్పాన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. జిల్లాలో టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కుల్లో ఐలా (ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ)లు ఉంటాయి. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు సభ్యులుగా ఉండే ఈ ఐలాల ద్వారా ఫైరింజన్లు, అంబులెన్స్‌లు, ఇతర సహాయక చర్యలకు అవసరమైన సదుపాయాలు కలిగి ఉంటాయి. ఈ ఐలాలు లేని పారిశ్రామిక ప్రాంతాలను గుర్తించి అక్కడ క్విక్ రెస్పాన్స్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదిస్తున్నారు.

సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు..

ఈ క్విక్ రెస్పాన్స్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఆయా పరిశ్రమలు ఖర్చు చేసే సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులను వాడుకోవాలని అధికారులు యోచిస్తున్నారు. కంపెనీల చట్టం ప్రకారం పరిశ్రమలు ఆర్జించే లాభాల్లో కనీసం 2% మొత్తాన్ని సీఎస్ఆర్ కింద ప్రజలకు ఉపయోగపడే పాఠశాలలు, ఆస్పత్రులు వంటి వాటికి ఈ నిధులను వెచ్చించాలి. ఈ నిధుల ద్వారా క్విక్ రెస్పాన్సిబిలిటీ సెంటర్లు ఏర్పాటైతే ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోకుండా కొంతమేర ప్రాణనష్టం తగ్గించవచ్చు.




కర్ణాటక వైపు వెళ్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

'నారింజ'కు వరద ఉధృతి

- ఒక గేటు 6 అడుగులు పైకెత్తి దిగువకు నీరు విడుదల
- పరిస్థితిని పర్యవేక్షించిన రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు

జహీరాబాద్: జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామ శివారులోని నారింజ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద వచ్చి చేరుతోంది. మంగళవారం వరద ఉధృతి పెరగడంతో ప్రాజెక్టులోని రెండో గేటును 6 అడుగులు, మూడవ గేటును అంగుళం మేర పైకెత్తి నీటిని దిగువ ప్రాంతానికి వదిలిపెడుతున్నారు. ప్రాజెక్టులోకి 4వేలకు పైగా క్యూసెక్కుల వరద చేరుతోంది. అంతేస్థాయిలో నీటిని దిగువకు వదిలిపెడుతున్నారు. నారింజ వాగు సైతం ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాజెక్టులో వరద పరిస్థితిని తహసీల్దార్ దశరథ్, డీఎస్పీ సైదా, నీటిపారులశాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈలు జనార్దన్‌రావు, రాజ్యలక్ష్మి, ఏఈఈలు జానకిరామ్, పాండు, శ్రీనివాస్, చందన, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రఘు, ప్రసాద్, ఎం.ఎం.మహబూబ్‌అలీలు సందర్శించి పరిశీలించారు.



నారింజ ప్రాజెక్టులో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే

జహీరాబాద్ టౌన్: మండలంలోని కొత్తూర్(బి) వద్ద నారింజ ప్రాజెక్టును ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు సందర్శించారు. జహీరాబాద్–బీదర్ రహదారిపై ప్రాజెక్టు ఉన్నందున ప్రజలు సెల్ఫీలు దిగేందుకు ప్రయత్నిస్తుంటారని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్, పోలీసు అధికారులను కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు మొయినుద్దీన్, ముర్తుజా, యాకూబ్ తదితరులున్నారు.

చెడ్డపేరు తెస్తే ఉపేక్షించేది లేదు

హాస్టళ్ల పనితీరుపై ఎమ్మెల్యే సంజీవరెడ్డి అసహనం



సమీక్షలో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: వసతి గృహాల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే ఘటనలు జరిగితే ఉపేక్షించేదిలేదని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి స్పష్టం చేశారు. సంక్షేమ హాస్టళ్ల నిర్వహణపట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. వసతిగృహాల్లోని సిబ్బంది ఇష్టానుసారం ప్రవర్తిస్తే వారి తొలగింపు తప్పదని హెచ్చరించారు. ప్రతీ హాస్టల్ విద్యార్థి పదోతరగతిలో 60% నుంచి 100% మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా స్టడీ అవర్స్ నిర్వహించాలని చెప్పారు. నాగల్‌గిద్ద మండలంలో హాస్టల్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ రావడంలేదని ఎంఈవోలు మన్మథకిషోర్, శ్రీనివాస్‌లు సూచించగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. తరచూ హాస్టళ్లను ఎంఈవోలు తనిఖీ చేయాలని సూచించారు.

నోటిని అదుపులో పెట్టుకోవాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అవాకులు, చవాకులు పేలారని, నోటిని అదుపులో పెట్టుకోవాలని సంజీవరెడ్డి సూచించారు. క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ...తండాలకు కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. గైరాన్ తండా ఘటన పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు రమేశ్‌చౌహాన్, దారం శంకర్, మహేశ్వర్ సేట్, శంకర్ ముదిరాజ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ గ్రామాలను విలీనం చేయండి

భానూరు, నందిగామ, క్యాసారం గ్రామాలపై కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే గూడెం



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండల పరిధిలోని భానూరు, నందిగామ, క్యాసారం గ్రామ పంచాయతీలను ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్యను కలసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఇటీవల పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో ఇంద్రేశం, జిన్నారం కేంద్రాలుగా నూతన మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడంతోపాటు..వీటి పరిధిలోని గ్రామాలను డీ నోటిఫికేషన్ చేస్తూ గెజిట్ విడుదల చేసిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పటాన్‌చెరు మండల పరిషత్ పరిధిలోని మొత్తం 19 గ్రామ పంచాయతీలలో భానూరు, నందిగామ, క్యాసారం గ్రామాలు మాత్రమే మండల పరిధిలో మిగిలిపోయాయని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాల నిర్మాణం కోసం పటాన్‌చెరు రెవెన్యూ పరిధిలోని పోచారం గ్రామ పరిధిలోగల సర్వే నంబర్ 69లో త్వరితగతిన భూమి కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే భూమి కేటాయింపులపై నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు.

నాణ్యమైన భోజనం అందించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న సౌజన్య

సంగారెడ్డి టౌన్: హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడంతోపాటు వారికి సరైన వసతులు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య స్పష్టం చేశారు. సంగారెడ్డిలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ విద్యార్థుల ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి బాగోగులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై ప్లాంట్ల ఏర్పాటు

ఎక్కడి విద్యుత్ అక్కడే వినియోగం ● మిగిలిన విద్యుత్ డిస్కమ్‌కు

సోలార్‌పై నజర్



నారాయణఖేడ్: సంప్రదాయేతర ఇంధన వనరుల దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పంచాయతీ కార్యాలయం మొదలుకుని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, సెక్రటేరియట్ వరకు అన్ని ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి సౌరవిద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్ని జిల్లా కలెక్టర్లతో దీనిపై వీడియో సదస్సు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి వినియోగం పెంచేందుకు రాష్ట్ర కేబినెట్ విధాన నిర్ణయం తీసుకుందని వివరించారు.

ఎక్కడికక్కడ విద్యుత్ ఉత్పత్తి

సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా ఎక్కడికక్కడ విద్యుత్ ఉత్పత్తి చేసి సదరు కార్యాలయాలకు వినియోగించుకోవాలని, మిగిలిన విద్యుత్‌ను డిస్కమ్‌కు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిస్కమ్ వారు తీసుకున్న విద్యుత్‌ను వినియోగదారులకు అందిస్తారు. ప్రతీ కార్యాలయం వద్ద మీటర్లను ఏర్పాటు చేసి ఇంపోర్ట్ (విద్యుత్ ఉత్పత్తి), ఎక్స్‌పోర్ట్ (డిస్కమ్‌కు ఇవ్వడం) రీడింగ్‌ను నమోదు చేయనున్నారు.

భారీగా విద్యుత్ వినియోగం

గ్రామస్థాయి నుంచి పట్టణ ప్రాంతాల వరకు నిత్యం విద్యుత్ వినియోగం భారీగా పెరిగిపోయింది. జిల్లాలో నివాస, వ్యవసాయ, కర్మాగారాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తదితరాలు కలిపి 6.90లక్షల విద్యుత్ కనెక్షన్లున్నాయి. వీటికి నిత్యం 15 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ప్రతీ ఏటా 10% నుంచి 20% విద్యుత్ వినియోగం పెరుగుతోంది. పదేళ్లకు క్రితం జిల్లాలో 7 నుంచి 8 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం అవుతుండగా ప్రస్తుతం అది రెట్టింపు అయ్యింది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) అంచనాల ప్రకారం వచ్చే మూడేళ్లలో 2028 నాటికి విద్యుత్‌కు మరింత డిమాండ్ ఏర్పడనుందని అంచనా వేసింది. ఇందుకోసం వచ్చే పదేళ్లనాటికి థర్మల్ పవర్ కంటే సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని నిర్ణయించారు.

వారంలోగా వివరాలు పంపించేందుకు ఆదేశం

జిల్లాలోని అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యా సంస్థలు, మార్కెటింగ్ శాఖ పరిధిలోని గిడ్డంగుల భవనాలపై రూఫ్ టాప్ సోలార్ పవర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. కలెక్టరేట్లు, పార్కింగ్, క్యాంటీన్ స్థలాల వివరాలు పంపించాలని కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటుకు అవసరమైన వివరాల కోసం ప్రశ్నావళిని పంపించి వారంలో అన్ని వివరాలు నమోదు చేసి విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆఫీసుకు పంపించాలని ఆదేశించారు.

భారీగా పెరిగిన వినియోగం



ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు కలెక్టరేట్ వివరాలు సేకరిస్తోంది. థర్మల్ విద్యుత్ విద్యుత్ వినియోగం భారీగా పెరిగిపోతుండటంతో సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

– శ్రీనాథ్, ఎస్ఈ, డిస్కమ్ సంగారెడ్డి

క్లుప్తంగా

రావురూకులలో విషాదం

అమెరికాలో రోడ్డు ప్రమాదంలో యువతి మృతి


శ్రీజ

సిద్దిపేటరూరల్: రావురూకుల గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందింది. వివరాలు ఇలా.. సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల గ్రామానికి చెందిన లక్కరసు శ్రీనివాస్ వర్మ, హేమలత కొన్నేళ్ల క్రితం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గండిమైసమ్మకు వలస వచ్చారు. వారికి శ్రీజ, శ్రేయ ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఉన్నత చదువుల కోసం శ్రీజ అమెరికాకు వెళ్లి ఇటీవల ఎంఎస్ పూర్తి చేసింది. కాగా సోమవారం రాత్రి ఓ రెస్టారెంట్‌లో భోజనం చేసి తన రూమ్‌కు కారులో వెళ్తుంది. ఈ క్రమంలో కారును ట్రక్కు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై స్పాట్‌లోనే చనిపోయింది. దీంతో కుటుంబంలో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.శ్రీజ చెల్లెలు శ్రేయ కూడా ఇటీవలే ఎంఎస్ చదివేందుకు అమెరికాకు వెళ్లింది. కూతురు చనిపోవడంతో తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

టీవీ,సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

దుబ్బాకరూరల్: విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. అక్బర్‌పేట- భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాత బెల్లోజి రమేశ్ సహకారంతో విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంజయ్య, హెచ్‌ఎంలు నీలం శ్రీనివాస్, నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీతాల కోసం కార్మికుల నిరసన


దౌల్తాబాద్‌లో భిక్షాటన చేస్తున్న కార్మికులు

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వం నుంచి వేతనాలు సక్రమంగా రాకపోవడంతో కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నామని గ్రామపంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎర్ర పోచయ్య అన్నారు. మంగళవారం మండలంలోని దౌల్తాబాద్‌లో పంచాయతీ కార్మికులు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ముత్యం, కార్యదర్శి అశోక్, సహాయ కార్యదర్శి శంకరయ్య కోశాధికారి సాయిలు, కమిటీ సభ్యులు, శాంతమ్మ, బాలమణి, యాదయ్య, పోచయ్య, రాజయ్య, నరేశ్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


రమణ

పటాన్‌చెరు టౌన్: మహిళ అదృశ్యమైన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నల్గొండకు చెందిన తిరుపతి బతుకుదెరువు కోసం నాలుగు నెలల క్రితం వచ్చి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటిలో నివాసం ఉంటూ స్థానికంగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తిరుపతి భార్య రమణ ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆస్పత్రికి వెళ్లిన వ్యక్తి..

సంగారెడ్డి క్రైమ్: ఆస్పత్రికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... పాపన్నపేట మండలం పాపన్నపేట గ్రామానికి చెందిన చాకలి ఎల్లయ్య(42), బంధువుల చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లాడు. ప్రతిరోజు సాయంత్రం తరచూ కల్లు తాగే అలవాటు ఉండటంతో సోమవారం సాయంత్రం ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. చుట్టుప్రక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బ్యాంక్ ఉద్యోగి ఇంట్లో చోరీ

సంగారెడ్డి క్రైమ్: ఉద్యోగి ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు దోచుకెళ్లారు. పట్టణ సీఐ రమేశ్ వివరాల ప్రకారం.. రాయికోడు మండలం పాంపాడు గ్రామానికి చెందిన బోరంచ నర్సింహులు వృత్తిరీత్యా పట్టణంలోని కెనరా బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్యాపిల్లలతో కలిసి మధురానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 8న రాఖీ సందర్భంగా స్వగ్రామానికి వెళ్లాడు. భార్య శశికళ, పిల్లలతో కలిసి అదే కాలనీలో ఉండే చిన్నమ్మ ఇంటికి ఈనెల 11న రాత్రి పడుకోవడానికి వెళ్లింది. 12న వచ్చి చూడగానే ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని మూడున్నర తులాల బంగారం, డబ్బు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటాడుకుందాం రా!

20 నుంచి మండల స్థాయిలో..
- సెప్టెంబర్‌లో జిల్లా స్థాయి పోటీలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ఒత్తిడి, ఆందోళన తగ్గించడానికి, శరీర దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి విద్యార్థులకు క్రీడలు దోహదపడతాయి. చదువుతోపాటు వారికిష్టమైన క్రీడాపోటీలను ప్రభుత్వం ప్రతియేటా నిర్వహిస్తుంది. ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. మూడంచెలలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడలు.. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించేందుకు అధికారులు దృష్టి సారించారు.


ఆటలు ఆడుతున్న విద్యార్థులు(ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): జిల్లాలో 990 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 211 ఉన్నత, 22 కేజీబీవీలు, 10 మోడల్, 109 గురుకుల, సాంఘీక సంక్షేమ పాఠశాలలు ఉన్నాయి. అలాగే సుమారు 500 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 3.40లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అండర్ 14, అండర్ 17 విభాగంలో బాల, బాలికలు పాల్గొననున్నారు.

ఆటలు ఇవే..

ఎస్‌జీఎఫ్‌లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, కరాటే, బ్యాడ్మింటన్, తైక్వాండో, సాఫ్ట్‌బాల్, బేస్ బాల్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, షటిల్, చదరంగం, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, ఫెన్సింగ్, క్రికెట్, రెజ్లింగ్ తదితర క్రీడలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో బాల,బాలికలు పాల్గొంటారు. అయితే మండల స్థాయిలో మాత్రం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ ఆటలు మాత్రమే నిర్వహిస్తామని, మిగతా ఆటలు జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

పది రోజుల పాటు పోటీలు

ఈ నెల 20 నుంచి మండల స్థాయి క్రీడలు ప్రారంభం కానున్నాయి. పది రోజుల పాటు పోటీలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్ ఆటలు మాత్రమే నిర్వహిస్తారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారికి సెప్టెంబర్ మొదటి లేదా రెండో వారంలో జిల్లా స్థాయి, అక్టోబర్‌లో రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. గెలిచిన వారికి అధికారులు ధ్రువ పత్రాలు అందజేస్తారు. అవి భవిష్యత్‌లో ఉద్యోగ నియామకాల్లో ఉపయోగపడతాయి. పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



ఈనెల 20 నుంచి మండల స్థాయిలో క్రీడలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ ఆడిస్తాం. మిగతా ఆటలు జిల్లా స్థాయిలో నిర్వహిస్తాం. ఎంఈఓ, పీడీ కలిసి ఈనెల 30లోపు మండల స్థాయి పోటీలు పూర్తి చేయాలి. అందులో గెలిచిన వారికి వచ్చే నెలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తాం.

– శ్రీనివాస్ రావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి

పకడ్బందీగా నిర్వహిస్తాం



జిల్లాలో క్రీడాపోటీలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. నిర్వహణ కోసం మండలానికి రూ.10వేల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. ఈనెలలో మండల స్థాయి పోటీలు పూర్తి చేసి, సెప్టెంబర్‌లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తాం. తర్వాత రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయి.

– వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి


ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

‘ములుగు’తో కపిల్ ఒప్పందం

ములుగు(గజ్వేల్): ములుగు కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన కపిల్ ఆగ్రో పామ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య మంగళవారం అధికారులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. వర్సిటీ వీసీ డాక్టర్. రాజిరెడ్డి, కపిల్ పామ్స్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ... విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ, అధిక దిగుబడి, పంట ఉత్పత్తి కోసం సాంకేతిక బదిలీపై దృష్టి సారించడమే లక్ష్యమన్నారు. అలాగే ఉద్యానవనంలో ఉమ్మడి విద్య, పరిశోధన, విస్తరణ కార్యకలాపాలను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. దీనివల్ల వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు వినూత్న ఇండో ఇజ్రాయెల్ వ్యవసాయ పద్ధతులు, ఇంటిగ్రేటెడ్ నేల, ఆకు విశ్లేషణ తదితర అంశాల గురించి తెలుసుకుంటారని పేర్కొన్నారు.


క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

రాష్ట్ర బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

వర్గల్(గజ్వేల్): ఈ నెల 16 నుంచి ఆదిలాబాద్ జిల్లాలో జరగనున్న రాష్ట్ర బేస్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు బాలికలు, బాలుర జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మ రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి మధు యాదవ్ తెలిపారు. మంగళవారం నెంటూరు విశ్వశాంతి గ్రౌండ్స్‌లో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించి ఒక్కో జట్టు నుంచి 18 మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అగ్గి రాజేసిన కబ్జా వార్త

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మాటల యుద్ధం
- మాజీ ఎమ్మెల్యేపై దాడికి యత్నం
- పెద్దశంకరంపేటలో ఉద్రిక్తత


మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిపై దాడికి యత్నిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

పెద్దశంకరంపేట(మెదక్): సోషల్ మీడియాలో వచ్చిన ఓ వార్త కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య అగ్గిరాజేసింది. పరస్పర దాడులకు దారి తీసింది. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ సంఘటన మంగళవారం పెద్దశంకరంపేటలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. దీంతో ‘మీరంటే మీరు’అంటూ ఇరు పార్టీల మధ్య వాట్సాప్‌లో చర్చ సాగింది. చివరకు ఒకరిపై ఒకరు దూషణలు చేసుకునే స్థాయికి చేరింది. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ ఇంటి ముట్టడికి వచ్చారు. ఆ సమయంలో శ్రీనివాస్ ఇంట్లో లేకపోవడంతో రోడ్డుపైనే ఆందోళనకు దిగారు. అదే సమయంలో మండల పరిధిలోని జూకల్‌లో పర్యటన ముగించుకొని పెద్దశంకరంపేటకు వచ్చిన నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జంగం శ్రీనివాస్‌ను చూసి అక్కడే ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు కోపోద్రిక్తులయ్యారు. నినాదాలు చేస్తూ భూపాల్‌రెడ్డి వాహనంపై ఒక్కసారిగా దాడికి యత్నించారు. ఎస్ఐ.ప్రవీణ్‌రెడ్డి తన సిబ్బందితో కలసి ఆందోళనకారులను చెదరగొట్టారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కల్పించడం, వాట్సాప్ గ్రూపులలో ఒకరిపై ఒకరు దూషణలకు పాల్పడితే అడ్మిన్‌తో పాటు అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవగాహనతోనే సైబర్ నేరాల కట్టడి

ఎస్పీ పరితోష్ పంకజ్


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి జోన్: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో సైబర్ వారియర్స్‌పై సమీక్ష నిర్వహించి, టీషర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైబర్ నేరాల కట్టడికి అవగాహన ఒక్కటే మార్గమని, అందుకు ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సైబర్ వారియర్స్ ఫోన్ కాల్స్‌కు త్వరితగతిన స్పందించి, బాధితులకు కచ్చితమైన సమాచారం అందించాలని తెలిపారు. సైబర్ వర్టికల్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జిల్లాను ముందంజలో ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, సైబర్ సెల్ సిబ్బంది ఉన్నారు.

కుక్కను కొట్టిన వారిపై ఫిర్యాదు


వీధికుక్కపై దాడి చేస్తున్న రాంసింగ్

పటాన్‌చెరు టౌన్: వీధి కుక్కను కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ ఫిర్యాదు చేసిన ఘటన మంగళవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. డివిజన్ పరిధి రాఘవేంద్రకాలనీ సమీపంలో ఓ వీధి కుక్కను కాళ్లు కట్టేసి రాంసింగ్, మరో వ్యక్తి రాడ్డుతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం ఆ కుక్కను వారి వెంట తీసుకెళ్లారు. సమీపంలో ఉన్న స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా జంతు క్రూరత్వ నివారణ సహాయకురాలు ప్రీతి ఈ ఘటన చూసి వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

69 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సదాశివపేట(సంగారెడ్డి): 69వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఉజ్వల జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకుల బృందం ఆధ్వర్యంలో 69 అడుగుల భారీ జాతీయ జెండాతో పట్టణం ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు చేసిన జాతీయ నినాదాలు పలువురిని ఆకర్షించాయి. ఈ సందర్భంగా ఎస్ఐ నాగేష్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే దేశభక్తిని అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో చదువుకుని దేశానికి సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగేష్, వైస్ ప్రిన్సిపాల్ అమరేందర్‌రెడ్డి, డైరెక్టర్లు రఘువర్ధన్‌రెడ్డి, కరస్పాండెంట్ పోల వెంకటేశం, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జోగిపేట సీఐ పిస్టల్ మిస్ ఫైర్

తప్పిన ప్రమాదం

జోగిపేట (అందోల్) : ఓ పోలీసు అధికారి పిస్టల్‌ను శుభ్రం చేస్తుండగా మిస్ ఫైర్ అయింది. వివరాలు ఇలా... జోగిపేట పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ మంగళవారం తన కార్యాలయంలో పిస్టల్‌ను బట్టతో శుభ్రం చేస్తుండగా అకస్మాత్తుగా పేలడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. ఆయన కూర్చున్న కుర్చీ ఎడమ భాగం వైపు ఉన్న హెడ్ కానిస్టేబుల్ పక్క నుంచి బుల్లెట్ దూసుకెళ్లడంతో ఆయన ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యాడు. పిస్టల్ నుంచి వెళ్లిన బుల్లెట్ గోడకు తగిలింది. ఆ సమయంలో సీఐ చింతకుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసు విషయమై మాట్లాడుతున్నాడు. శుభ్రం చేస్తున్న క్రమంలో అనుకోకుండా పిస్టల్ ట్రిగ్గర్‌పై చేయి పడటంతో పేలినట్లు భావిస్తున్నారు. అయితే పెద్దగా శబ్దం రావడంతో కార్యాలయంలో ఉన్న వట్‌పల్లి ఎస్ఐ, అందోల్ మాజీ కౌన్సిలర్ హరికృష్ణ, ఆత్మ డైరెక్టర్ రొయ్యల శ్రీనివాస్‌తోపాటు కొందరు బయటకు పరుగులు తీశారు. స్టేషన్ బయట నిలబడి మాట్లాడుతున్న జోగిపేట ఎస్ఐ పాండు సీఐ కార్యాలయం వద్దకు పరుగులు తీశారు.

పుల్‌కల్ డీసీసీబీ రూ.60 కోట్ల టర్నోవర్

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ డీసీసీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహిస్తున్నామని బ్రాంచ్ మేనేజర్ రాజనర్సింహులు తెలిపారు. మంగళవారం బ్యాంక్ పరిధిలోని గ్రామాల్లో రైతులు, ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. పుల్‌కల్ డీసీసీబీ బ్రాంచ్ రూ.60కోట్ల టర్నోవర్‌తో నడుస్తుందని చెప్పారు. గృహరుణాలు, మహిళా రుణాలు చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫీసర్ ప్రశాంత్, సిబ్బంది మురళీకృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

ఖజానాలో చోరీ.. పోలీసుల తనిఖీలు


జహీరాబాద్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జహీరాబాద్: హైదరాబాద్‌లోని చందానగర్‌లో గల ఖజానా జ్యువెలరీ దుకాణంలో మంగళవారం ఉదయం చోరీ జరిగింది. దీంతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు జహీరాబాద్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. డీఎస్పీ సైదా ఆధ్వర్యంలో సీఐ శివలింగం, ఎస్ఐలు కాశీనాథ్, వినయ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి సిబ్బందితో కలిసి మండలంలోని హుగ్గెల్లి బైపాస్ వద్ద 65వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. దొంగతనానికి పాల్పడిన నిందితులు ముగ్గురు మోటారు సైకిల్‌పై జహీరాబాద్ వైపు పారిపోయారని వచ్చిన సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయినా నిందితుల జాడ దొరకలేదు. మరో మార్గం నుంచి పారిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు.

స్టాక్ మార్కెట్ పేరుతో సైబర్ మోసం

రూ.49 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. నకిలీ స్టాక్ మార్కెట్ పేరుతో ఓ ఉద్యోగిని బురిడీ కొట్టించి నగదు కాజేశారు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ విజయ్ కృష్ణ కథనం ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కర్దనూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జూలై 6న స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ బాధితుడికి వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలు నమోదు చేశాడు. అపరిచిత స్టాక్ మార్కెట్ నిర్వాహకుడు ఐడీని క్రియేట్ చేసి ఇచ్చాడు. బాధితుడు నగదును ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. పెట్టిన పెట్టుబడి, లాభాలు చూపిస్తూ వచ్చారు. మొత్తం రూ.49 లక్షల 40 వేలు పెట్టుబడి పెట్టాడు. ఈ క్రమంలో తాను పెట్టిన నగదుతోపాటు లాభాలు ఇవ్వాలని బాధితుడు అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించి ముందుగా సైబర్ క్రైమ్, మంగళవారం బీడీఎల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చెక్‌డ్యాంలకు నిధుల జాడేది?


కర్నాటక వైపు వెళుతున్న నీరు

- ప్రతిపాదనలకే పరిమితం
- నారింజ నీరు కర్నాటక పాలు
- నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నియోజకవర్గంలో శాశ్వత నీటి వనరులు లేవు. భారీ, మధ్య తరహా ప్రాజెక్టులు లేక రైతులు బోరుబావులపై ఆధారపడి పంటలు పండిస్తున్నారు. నారింజ ప్రాజెక్టు ఉన్నా ఆయకట్టుకు నీరు అందించలేని స్థితిలో ఉంది. దీంతో భూగర్భ జలాలు పెంచాలని నిర్ణయించి చెక్ డ్యాంల నిర్మాణానికి నీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఏడాది గడుస్తున్నా ఇంత వరకు నిధులు మంజూరు కాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామం వద్ద సుమారు ఆరు దశాబ్దాల క్రితం నారింజ ప్రాజెక్టును 600 ఎకరాల్లో నిర్మించారు. 15 ఫీట్ల ఎత్తులో ఉన్న ప్రాజెక్టులో సుమారు ఒక క్యూసెక్కు నీటి నిలువ ఉంటుంది. వేయి ఎకరాలకు నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రాజెక్టును కట్టారు. కానీ కుడి, ఎడమ కాలువల నిర్మాణ లోపం వల్ల ఇప్పటి వరకు ఎకరం పొలానికి కూడా నీరందలేదు. దీంతో ప్రాజెక్టును ఊట చెరువుగా మార్చేశారు. శాశ్వత నీటి వనరులు లేని ప్రాంతంలో ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని రైతులు, ఉద్యమకారులు, తదితరులు ఎన్నోసార్లు ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వాలు మారినా దాని గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. ఫలితంగా ప్రతి సంవత్సరం రెండు మూడు టీఎంసీల నీరు కర్నాటక రాష్ట్రానికి తరలిపోతుంది.

రూ.24.26 కోట్లతో ప్రతిపాదనలు

నారింజ ప్రాజెక్టులో సుమారు ఒక క్యూసెక్కుల నీరు మాత్రమే నిల్వ ఉంటుంది. ఒకటి, రెండు భారీ వానలకే ప్రాజెక్టు నిండిపోయి జలకళ సంతరించుకుంటుంది. వర్షాకాలం భారీ వానలు పడితే గేట్లు ఎత్తి ఆ నీరంతా వృథాగా కర్నాటకకు వదిలేస్తున్నారు. ప్రతి సంవత్సరం రెండు, మూడు టీఎంసీల నీరు తరలిపోతుంది. నీరు పక్క రాష్ట్రం పాలు కాకుండా ఉండేందుకు ప్రాజెక్టు కింద చెక్‌డ్యాంలు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు రూ.24.26 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మండలంలోని నారింజ వాగుపై బుర్దిపాడ్, బూచినెల్లి, సత్వార్, చిరాగ్‌పల్లి గ్రామాల శివారులో చెక్‌డ్యాంలు నిర్మించాలని ప్రతిపాదనలు పంపించారు. కానీ ఇంత వరకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేవు. ఇప్పటికైనా నిధులు విడుదల చేసి చెక్‌డ్యాంల నిర్మాణానికి చొరవ తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

రెండు రోజులుగా..

రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టుకు వరద నీరు వచ్చింది. దీంతో అధికారులు గేట్లు ఎత్తివేశారు. దీంతో పెద్ద ఎత్తున నీరు కర్నాటక వైపు వెళ్తుంది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో భారీ వానలు పడిన సందర్భాల్లో ఇలా నీరు వృథాగా పోతుంది. చెక్‌డ్యాంల విషయమై ఇరిగేషన్ డీఈని వివరణ కోరగా.. ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైతే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు.